క్లుప్తంగా

విద్యార్థులకు వైద్యశిబిరం



తెనాలి: పట్టణ చినరావూరుతోట 14వ వార్డులోని మదర్ థెరిస్సా ప్రాథమిక పాఠశాల 1–5 తరగతుల విద్యార్థులకు బుధవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ముంబయి) కోస్తాంధ్ర అధ్యక్షుడు పల్నాటి నాగరాజు ఆధ్వర్యంలో ఈ ఏర్పాటు చేశారు. స్థానిక హ్యాపీ హాస్పటల్ డాక్టర్ అరుణ్‌తేజ పిల్లలను పరీక్షించి, అవసరమైన మందులు, సిరప్‌లను అందజేశారు. హాస్పటల్ సిబ్బంది మంజునాథ్, రాజు, శేఖర్, సాంబశివరావు సహకరించారు.

ఒలింపియాడ్‌లో జయశ్రీనివాస్‌కు 20వ ర్యాంక్



తెనాలిఅర్బన్: న్యూఢిల్లీకి చెందిన సిల్వర్‌జోన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గతేడాది డిసెంబర్‌లో నిర్వహించిన ఇంటర్నేషనల్ ఒలింపియాడ్ ఆఫ్ ఇంగ్లిష్ లాంగ్వేజ్ పరీక్షలో బోసురోడ్డులోని నెహ్రూనికేతన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థి సిహెచ్ జయశ్రీనివాస్ రాష్ట్ర స్థాయిలో 20వ ర్యాంక్ సాధించినట్లు స్కూల్ మేనేజింగ్ డైరెక్టర్ దాసరి మురళీకాంత్ తెలిపారు. అలాగే షేక్ సుమయ్యకు 25వ ర్యాంక్, కె.మోక్షిత్ సాయి 113 ర్యాంక్ సాధించినట్లు చెప్పారు. ఆరుగురికి బంగారు, ఇద్దరికి రజిత, ఒకరికి కాంస్య పతకాలు వచ్చినట్లు వివరించారు. బుధవారం స్కూల్ ఆవరణలో పతకాలు సాధించిన వారికి వాటిని అందజేసి అభినందించారు. పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బ్యూటీషియన్ కోర్సులను సద్వినియోగం చేసుకోండి



తెనాలిఅర్బన్: బ్యూటీషియన్ కోర్సులను అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆర్ఎస్ఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి అంబటి మారుతీరామ్ పేర్కొన్నారు. సేవా భారతి ఆధ్వర్యంలో బుర్రిపాలెం రోడ్డులోని ఆర్ఎస్ఎస్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన ఉచిత బ్యూటీషియన్ శిక్షణ తరగతులను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి త్రిపురమల్లు హనుమత్ ప్రసాద్, సేవా భారతి నగర్ కార్యదర్శి వడాలశెట్టి లక్ష్మీనారాయణ, బ్యూటీషియన్ కోర్సు నిర్వాహకురాలు వి.విజయదుర్గ పాల్గొన్నారు.

అఖిలాండేశ్వరి దేవస్థానం వార్షికోత్సవం



మంగళగిరి: మంగళగిరి స్టేషన్ రోడ్‌లోని అఖిలాండేశ్వరి అమ్మవారి దేవస్థానంలో బుధవారం దేవస్థానం 16వ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా అమ్మవారికి శ్రీ చక్ర పూజ, సహస్ర నామార్చన, పంచ హారతులు, మంత్రపుష్పం, సాయంత్రం పవళింపు సేవ పూజలు జరిగాయి. అనంతరం అన్నదానం నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని అన్నప్రసాదం స్వీకరించారు. దేవస్థానం చైర్మన్ కాలారి సుబ్బారావు, వసంత దంపతులు, భక్త బృందం ప్రతినిధులు, పాల్గొన్నారు.

ఘనంగా వసంత పంచమి వేడుకలు



తాడికొండ: తాడికొండ మండలం లాం గ్రామంలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో బుధవారం వసంత పంచమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులకు వారి పిల్లలతో పాదపూజ కార్యక్రమం హిందూ కళాశాల విశ్రాంత సంస్కృత విభాగాధిపతి డాక్టర్ దివి నరసింహ దీక్షితులు ఆధ్వర్యంలో నిర్వహించా రు. ఈ సందర్భంగా ఆయన పాద పూజవిశిష్టతను తెలియజేశారు. మరో అతిథి ఇంటర్ స్టేట్ కో–ఆర్డినేటర్ మరియు ఇండియన్ రెడ్‌క్రాస్ యూత్ అధ్యక్షుడు గుంటూరు కళాపీ ఠం అధ్యక్ష లక్ష్మీనారాయణ మాట్లాడుతూ చక్కటి భారతీయ సంస్కృతిని వసంత పంచమి రోజున పాఠశాలలో నిర్వహించడం ఆనందదాయకం అన్నారు. పాఠశాల వైస్ చైర్మన్ చుక్కపల్లి రమేష్, డైరెక్టర్లు చుక్కపల్లి రాకేష్, చుక్కపల్లి ప్రియాంక, ప్రిన్సిపాల్ డాక్టర్ ఉషారాణి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆరోగ్య పరిరక్షణ కేంద్రాలు

- ప్రజల మన్ననలు పొందుతున్న అర్బన్ హెల్త్ సెంటర్
- అన్నిరకాల పరీక్షలు, వైద్యసేవలు అందుబాటులో..
- సంతోషం వ్యక్తం చేస్తున్న పేదలు



మారీసుపేటలోని డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్



నిర్మాణ దశలో ఉన్న అర్బన్ హెల్త్ సెంటర్ భవనం

తెనాలిఅర్బన్: తెనాలి మారీసుపేటలోని డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్ పేద ప్రజల మన్ననలను పొందుతుంది. వారికి మెరుగైన వైద్యాన్ని అందించటంతో పాటు వారిలో ఆరోగ్య భరోసాను నింపుతుంది. దీంతో ఎక్కువ మంది పేద ప్రజలు దీనిని ఉపయోగించుకుంటూ...వీటిని ఏర్పాటు చేసిన రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు. తెనాలి పట్టణ పరిధిలోని 21, 22, 23, 24, 33, 35 వార్డుల పరిధిలోని పేద ప్రజలకు అందుబాటులో వైద్యాన్ని అందించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం మారీసుపేటలో డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌ను ఏర్పాటు చేసింది. 2021లో రాష్ట్ర ప్రభుత్వం దీని ఏర్పాటుకు చర్యలు తీసుకుంది. వైద్య సేవలు అందించేందుకు అవసరమైన వైద్యులు, సిబ్బందిని నియమించింది. మొదట్లో వీరందరూ సచివాలయాల వద్ద వైద్య సేవలు అందించారు. అనంతరం మారీసుపేట రేపల్లె గేటు సమీపంలోని అద్దె భవనంలో ఆగస్ట్ 9వ తేదీన సెంటర్‌ను ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి అక్కడే సేవలు కొనసాగుతున్నాయి.

నిర్మాణ దశలో అర్బన్ హెల్త్ సెంటర్..

పట్టణ పరిధిలో ఏర్పాటు చేసిన డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌లను శాశ్వత భవనాలలో ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఆదేశించి, నిర్మాణం కోసం రూ.1.10కోట్ల నిధులను విడుదల చేసింది. దీంతో మున్సిపల్ అధికారులు చంద్రబాబు నాయుడు కాలనీలోని మున్సిపల్ స్థలాన్ని కేటాయించారు. అందులో నిర్మాణ పనులు జరుగుతున్నాయి. అతి కొద్ది నెలలో నిర్మాణం పూర్తి కానున్నట్లు ఇంజినీరింగ్ అధికారులు తెలిపారు.

అందుబాటులో 63 రకాల పరీక్షలు..

డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో రక్త, మూత్ర, ఈసీజీ, లివర్ వంటి వాటికి సంబంధించిన 63 రకాల పరీక్షలు చేస్తున్నారు. షుగర్, బీపీ వంటి పరీక్షలు ఎక్కువ మంది చేయించుకుంటున్నారు. వీరికి ప్రతినెల మందులను కూడ ఇక్కడ ఉచితంగా ఇస్తున్నారు. ఇదికాకుండా గర్భిణీలకు రక్త హీనత నివారణకు అవసరమైన ఇంజక్షన్‌లు, సెలైన్‌లు ఇక్కడే పెడుతున్నారు. చిన్న, చిన్న గాయాలకు కూడ ఇక్కడ చికిత్సలు అందిస్తున్నారు.

ఏడాదికి 12 వేల మందికిపైగా సేవలు..

మారీసుపేటలో ఏర్పాటు చేసిన డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో రోజుకు 20 నుంచి 25 మంది వైద్యసేవలు పొందుతున్నారు. 2022 సంవత్సరంలో ఇక్కడ 8,690 మంది వైద్య సేవలు పొందారు. అలాగే గతేడాది 12,821 మంది, ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు 1283 మంది వైద్య సేవలు పొందినట్లు రికార్డులు చెబుతున్నాయి. అదే విధంగా ఇక్కడ రక్త, మూత్ర, ఈసీజీ వంటి పరీక్షలను ప్రతి రోజు 12 మంది చేయించుకుంటున్నారు. గతేడాది 4,212 మంది వివిధ రకాల పరీక్షలు చేయించుకున్నట్లు సిబ్బంది తెలిపారు.



ఆరోగ్య కేంద్రంలో రోగులకు పరీక్షలు

వృద్ధాప్యంలో భరోసా



నాకు షుగర్, బీపీ ఉంది. ఏడాది నుంచి ఇక్కడికి వచ్చి షుగర్ పరీక్షలు చేయించుకుని మందులు తీసుకుంటున్నాను. అంతే కాకుండా నాకు 80 సంవత్సరాలు వచ్చాయి. వృద్ధాప్యంలో అనేక సమస్యలు వస్తున్నాయి. ప్రతి చిన్న రోగానికి ఇక్కడికే వచ్చి సేవలు పొందుతున్నాను. ప్రభుత్వం ఏర్పాటు చేసిన డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్ వృద్ధాప్యంలో ఉన్న మాలాంటి వారికి ఎంతో భరోసాను కల్పిస్తోంది.

–జొన్నల సూర్యప్రకాష్‌రెడ్డి, మారీసుపేట, తెనాలి

అర్బన్ హెల్త్ సెంటర్ సేవలు బాగున్నాయి..



మారీసుపేటలో ఏర్పాటు చేసిన డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్ సేవలు బాగున్నాయి. గతంలో చిన్న పాటి రోగం వస్తే ఆర్ఎంపీలను సంప్రదించాల్సి వచ్చేది. నేడు ఆ పరిస్థితి లేదు. ఎంబీబీఎస్ చదివిన వైద్యులతో ఇక్కడ చికిత్స పొందుతున్నాం. నేను ఆయాసం, నీరసంతో ఏడాది నుంచి బాధపడుతున్నాను. అప్పటి నుంచి ఇక్కడికి వచ్చి సేవలు పొందుతున్నాను. ఇక్కడ పనిచేసే వైద్యులు, సిబ్బంది మాకు అవసరమైన అన్ని సేవలు అందిస్తున్నారు. వీరి సేవలు చాలా బాగున్నాయి.

–కనకదుర్గ, మారీసుపేట, తెనాలి

హెల్త్ సెంటర్ సేవలు విస్తృతం అవుతున్నాయి..



డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌లోని వైద్య సేవలను ప్రభుత్వం రోజురోజుకు విస్తరిస్తుంది. రోగులకు అవసరమైన మౌలిక వసతులు ఏర్పాటు చేయటంతో పాటు సిబ్బందిని పూర్తిస్థాయిలో నియామకం చేసింది. రోగులకు అవసరమైన టీకాలు, మందులు కూడా ఇక్కడే ఇస్తున్నాం. ఈప్రాంతంలోని ప్రజలు అర్బన్ హెల్త్ సెంటర్ సేవలను ఉపయోగించుకోవాలి.

– డాక్టర్ వి.దేవికా వాణి, మెడికల్ ఆఫీసర్, డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్

గ్రామీణ బంద్ కరపత్రాల పంపిణీ



తెనాలి: సంయుక్త కిసాన్‌మోర్చా – కార్మిక సంఘాల ఐక్యవేదిక పిలుపు ప్రకారం ఈనెల 16న జరగనున్న గ్రామీణ బంద్, పారిశ్రామిక సమ్మెలో రైతులు, కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం కోరింది. రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివ సాంబిరెడ్డి బుధవారం రూరల్ మండలం బుర్రిపాలెంలో ప్రచారం నిర్వహించారు. రైతులను కలిసి కార్యక్రమ కరపత్రాలను పంచారు. రైతాంగ ఉద్యమానికి తలవంచి వ్యవసాయ నల్లచట్టాలను రద్దుచేసిన ప్రధాని మోదీ, మరొక రూపంలో వాటిని అమలుచేస్తున్నారని శివసాంబిరెడ్డి ఆరోపించారు. కార్పొరేట్ కంపెనీలకు రాయితీలిచ్చి సామాన్యులపై జీఎస్టీ పేరుతో పన్నులు పెంచారని చెప్పారు. రుణ ఉపశమన చట్టంకోసం జరిగే గ్రామీణ బంద్‌లో పాల్గొనాలని కోరారు. వీరితో అడపాల దుర్గాప్రసాద్, కటిక శ్రీకాంత్, తోట నాగేశ్వరరావు, బి.శ్రీనివాసరావు, చెన్నారెడ్డి ఉన్నారు.

ప్రారంభమైన క్రైస్తవ ఉపవాస ప్రార్థనలు

కాకుమాను: క్రైస్తవ సోదరులు నియమ నిష్ఠలతో చేసే ఉపవాస ప్రార్థనలు బుధవారం నుంచి ప్రారంభమయ్యాయి. మండలంలోని అన్ని గ్రామాలలో ఈస్టర్ పండుగను పురస్కరించుకుని నలభై రోజుల పాటు దైవ భక్తులు ఉపవాసాలు ఉండి ప్రత్యేక ప్రార్థనలు చేస్తారు. స్థానిక ఆంధ్రా ఇవాంజలికల్ లూథరన్ పరిశుద్ధ దేవాలయ ప్రాంగణంలో భస్మ బుధవారం సందర్భంగా భక్తులకు తేనీటి విందు నిర్వహించారు. మార్చి 28 వరకు ఉపవాసాలు ఉండి 29తో ముగిస్తారు. తొలుత దైవజనులు కృపాదానం దైవ సందేశం చేశారు. అధిక సంఖ్యలో క్రైస్తవులు పాల్గొన్నారు.

డీఎస్పీ రమేష్ బాధ్యతలు స్వీకరణ



తెనాలిరూరల్: తెనాలి డీఎస్పీగా ఎం. రమేష్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జరిగిన బదిలీల్లో భాగంగా ఇప్పటి వరకు ఇక్కడ డీఎస్పీగా పని చేసిన బి.జనార్ధనరావు ఎన్టీఆర్ జిల్లా కమిషనరేట్‌లో ట్రాఫిక్ ఏసీపీగా బదిలీపై వెళ్లారు. ప్రస్తుతం విజయవాడ కమిషనరేట్ పరిధిలో మైలవరం ఏసీపీగా ఉన్న ఎం.రమేష్ తెనాలి డీఎస్పీగా నియమితులయ్యారు. ఈమేరకు ఆయన బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాబోయే ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేవిధంగా తామంతా కృషి చేస్తామన్నారు. సమస్యాత్మక గ్రామాలపై దృష్టి సారిస్తామని చెప్పారు. రౌడీషీటర్ల కదలికలపై నిఘా ఉంచడంతో పాటు వారిని బైండోవర్ చేస్తామన్నారు. మహిళల భద్రత, రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక ప్రాధాన్యతనిస్తామని డీఎస్పీ రమేష్ చెప్పారు. నూతన డీఎస్పీకి డీఎస్పీ కార్యాలయ సిబ్బందితో పాటు తెనాలి, చేబ్రోలు, కొల్లిపర, పొన్నూరు పోలీసులు స్వాగతం పలికారు.

దామాషా ప్రకారం కాపులకు సీట్లు ఇవ్వాలి

అఖిల భారత కాపు జాగృతి జిల్లా అధ్యక్షురాలు కమ్మెల రజని



మాట్లాడుతున్న కమ్మెల రజని

తెనాలి: రాష్ట్రంలో అత్యధిక జనాభా కలిగిన కాపులకు రానున్న ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు దామాషా ప్రకారం సీట్లు కేటాయించాలని అఖిల భారత కాపు జాగృతి జిల్లా అధ్యక్షురాలు కమ్మెల రజని శ్రీనివాసరావు కోరారు. స్థానిక పాండురంగపేటలో బుధవారం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు ఏ కాపు బిడ్డకు కష్టం వచ్చినా కాపు జాగృతి అండగా ఉంటుందన్నారు. రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలను కలుపుకొని వారికీ తోడుగా ఉంటామన్నారు. కాపులు రాజ్యాధికారం దిశగా ముందుకు సాగాలని సూచించారు. ఈనెల 16న విజయవాడలో జరిగే కాపు ప్రతినిధుల సభకు జిల్లా నుంచి అత్యధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు. వీరితో పిరాటి శ్రీలక్ష్మి, చందు కనకమహాలక్ష్మి, ఇక్కుర్తి నీలిమ, దాసరి సరోజ, కమ్మెల నాగదివ్య తదితరులున్నారు.

కనుల పండువగా శ్రీనివాసుని బ్రహ్మోత్సవాలు

హాజరైన ప్రముఖులు



అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దేవదాయ శాఖ సలహాదారు శ్రీకాంత్

గుంటూరు రూరల్: గోరంట్ల గ్రామంలోని లక్ష్మీ పద్మావతి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ 20వ వార్షిక బ్రహ్మోత్సవాలు గ్రామ మాజీ సర్పంచ్ యర్రంశెట్టి వేణుగోపాల్ ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. బుధవారం జరిగిన పూర్ణాహుతి, ధ్వజారోహణము, మహా అన్నదాన కార్యక్రమాలకు ముఖ్య అతిథులుగా వేద సీడ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తులసి ధర్మచరణ్, రాష్ట్ర దేవదాయ శాఖ సలహాదారుడు జ్వాలాపురం శ్రీకాంత్‌లు హాజరై స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా తులసి ధర్మచరణ్ మాట్లాడుతూ గోరంట్ల గ్రామంలో దేవాలయాల అభివృద్ధికి యర్రంశెట్టి వేణుగోపాల్ విశేషంగా కృషి చేస్తున్నారన్నారు. ఆయన బాటలో గ్రామస్తులు, యువత నడుస్తూ గ్రామ అభివృద్ధికి బాటలు వేయటం ఎంతో గొప్ప విషయమన్నారు. యర్రంశెట్టి వేణుగోపాల్ మాట్లాడుతూ కలియుగ దైవం వేంకటేశ్వర స్వామి అనుగ్రహం ప్రతి ఒక్కరికి ఉండాలని, పాడి పంటలు సురక్షితంగా ఉంటూ, ప్రతి ఒక్కరు ఆనందంగా ఉండాలని కోరారు. ఆధ్యాత్మిక ప్రాంతంగా గోరంట్ల గ్రామం విరాజిల్లుతోందని, భవిష్యత్‌లో మరింత అభివృద్ధి పథంలో గోరంట్ల గ్రామం నడవాలని స్వామి వారిని కోరినట్లు చెప్పారు. కార్యక్రమంలో భాగంగా 20వేల మందికి పైగా భక్తులకు, గ్రామస్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ట్రిపుల్ ఎక్స్ సోప్స్ అధినేత అరుణాచల మాణిక్యవేల్, కంచర్ల ఆంజనేయులు, గొడుగులూరి సుబ్బారావు, యనమళ్ళ నాగేశ్వరరావు, కోలా వెంకటేశ్వర్లు, యర్రంశెట్టి సురేష్, యర్రంశెట్టి విజయ్, చిక్కం శ్రీనివాసరావు, బేతంశెట్టి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పక్షుల కేంద్రాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలి



కేంద్రంలో పక్షులను తిలకిస్తున్న ఆశిష్‌కుమార్ జీనా

పెదకాకాని: పక్షుల కేంద్రాన్ని ప్రసిద్ధ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని ఒడిశా రెవెన్యూ శాఖ అడిషనల్ సెక్రటరీ ఆశిష్ కుమార్ జీనా అన్నారు. పెదకాకాని మండలంలోని ఉప్పలపాడు పక్షుల కేంద్రాన్ని బుధవారం ఒడిశా రెవెన్యూశాఖ అడిషనల్ సెక్రటరీ సందర్శించారు. ఈ సందర్భంగా ఆశిష్ కుమార్ జీనా మాట్లాడుతూ భారతదేశంలో ఉన్నటువంటి పక్షుల కేంద్రాల్లో ఉప్పలపాడు పక్షుల కేంద్రం ప్రసిద్ధిగాంచిందన్నారు. తక్కువ స్థలంలో ఎక్కువ పక్షులు సేదతీరడం అభినందనీయమన్నారు. పక్షుల కేంద్రం నిర్వహణ బాధ్యతలు చేపట్టిన అటవీశాఖ పనితీరు బాగుందని కితాబిచ్చారు. పక్షుల కేంద్రంలో జరిగే అభివృద్ధి కార్యక్రమాలను చైర్మన్ పి అనిల్‌కుమార్ వివరించారు. ఈ కార్యక్రమంలో పక్షుల కేంద్రం చైర్మన్ పెరుమాళ్ళ అనిల్ కుమార్, డీఆర్ఓ వెంకటేశ్వరరావు, బీటు అధికారి సంతోష్‌లు పాల్గొన్నారు. ఒరిస్సా రెవెన్యూ శాఖ అడిషనల్ సెక్రటరీ ఆశిష్ కుమార్ జీనాకు పక్షుల కేంద్రం లోగోతో ఉన్న టీషర్ట్‌ను బహుమతిగా అందజేశారు.

రేపు రథసప్తమి వేడుకలు

తాడేపల్లిరూరల్: పెనుమాకలో వేంచేసియున్న వైష్ణవ మహాదివ్య క్షేత్రంలో ఈనెల 16వ తేదీ రథసప్తమి వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు వైష్ణవ మహాదివ్య క్షేత్ర సేవా సంఘం అధ్యక్షుడు చలవాది మల్లికార్జునరావు తెలిపారు. బుధవా రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నూతనంగా నిర్మించిన స్వామివారి దేవాలయంలో రథసప్తమి వేడుకలను నిర్వహించనున్నామని తెలిపారు. కళ్యాణ వేంకటేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణంలో గల మాడవీధులలో ఉదయం 6 గంటలనుంచి రాత్రి 7 గంటల వరకు తిరుమల వాస్తవులు అంగరంగ వైభంగా జరుగుతాయని వివరించారు. అనంతరం రథసప్తమి వేడుకల పోస్టర్‌ను ఆవిష్కరించారు.

షూటింగ్‌లో కేఎల్‌యూ విద్యార్థికి బంగారు పతకాలు



తాడేపల్లిరూరల్: స్థానిక వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటీలో సీఎస్ఐటీ మూడవ సంవత్సరం చదువుతున్న విద్యార్థి జూనియర్ వరల్డ్‌కప్‌లో రెండు బంగారు పతకాలు సాధించినట్లు వర్సిటీ క్రీడల అసోసియేట్ డీన్ డాక్టర్ కె.హరికిషోర్ తెలిపారు. బుధవారం యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 12 నుంచి 18వ తేదీ వరకు స్పెయిన్‌లో జరుగుతున్న జూనియర్ వరల్డ్‌కప్ పోటీలలో తమ విశ్వవిద్యాలయంలో సీఎస్ఐటీ మూడవ సంవత్సరం చదువుతున్న విద్యార్థి మద్దినేని ఉమా మహేష్ రైఫిల్ షూటింగ్‌లో ఒకే చాంపియన్ షిప్‌లో రెండు బంగారు పతకాలు సాధించి సంచలనం సృష్టించాడన్నారు. ఎయిర్ రైఫిల్ మిక్స్‌డ్ బృందం పోటీలలో కూడా ఉమా మహేష్ బంగారు పతకాన్ని సాధించాడని వివరించారు. ఈ సందర్భంగా వైస్ చాన్స్‌లర్ డాక్టర్ జి.పార్థసారథివర్మ, ప్రొ.వైస్ చాన్స్‌లర్లు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎస్.వెంకటరామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, విద్యార్థి సంక్షేమం విభాగాధిపతి డాక్టర్ సీహెచ్ హనుమంతరావు, వ్యాయామ అధ్యాపకులు తదితరులు బంగారు పతకాలను సాధించిన ఉమామహేష్‌ను అభినందించారు.

సురక్ష శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



రోగులకు మందులు పంపిణీ చేస్తున్న వైద్యసిబ్బంది

తెనాలిఅర్బన్: జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంప్‌లను అందరు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ ఆరోగ్యాధికారి డాక్టర్ కె.హెలెన్ నిర్మల పేర్కొన్నారు. ఎన్వీఆర్ కాలనీలోని సచివాలయం వద్ద బుధవారం రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంప్‌ను నిర్వహించారు. స్పెషలిస్ట్ వైద్యులు క్యాంప్‌లో పాల్గొని రోగులకు వైద్య సేవలు అందించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ పేదలు నివశించే ప్రాంతంలోనే వారికి వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఆరోగ్య సురక్ష క్యాంప్‌లు నిర్వహిస్తుందని చెప్పారు. అన్ని రకాల వైద్య సేవలు, వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేస్తున్నట్లు తెలిపారు. డాక్టర్ వట్టిప్రోలు మౌనిక కుమార్ మాట్లాడుతూ జనరల్ ఓపీ –199, గైనికాలజీ–43, డెర్మటాలజీ –58, అప్తమాలజీ –108 మందికి పరీక్షలు చేయటం జరిగిందన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ ఆవుత కోటయ్య, డాక్టర్ కుప్పా రాధిక, డాక్టర్ ముద్రకోల అనురాధ, డాక్టర్ సిహెచ్ దేవకి, అసిస్టెంట్ మలేరియా అధికారి చిరసాని ప్రభాకర్ రెడ్డి, ఆరోగ్య విస్తరణాధికారి అందే బాల చంద్రమౌళి, సబ్ యూనిట్ అధికారి శ్రీకంఠ ఉమాకాంత్, ఎం ఆశీర్వాదం, దీపాల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బాలల సినిమా షూటింగ్ ప్రారంభం



క్లాప్ కొడుతున్న సాదు చలపతి

తెనాలి: పట్టణానికి చెందిన కనపర్తి రత్నాకర్ దర్శకత్వంలో సీకే మీడియా పతాకంపై తీస్తున్న బాలల సినిమా షూటింగ్ బుధవారం స్థానిక గాంధీఇర్విన్ పార్కులో ప్రారంభమైంది. సూపర్‌స్టార్ బాల నటుడు కేజీఎఫ్ భానుప్రకాష్, కె.గోము, బెల్లంకొండ వెంకట్ పాత్రధారులపై తొలి సన్నివేశాన్ని చిత్రీకరించారు. పూజాకార్యక్రమాన్ని గొల్లపూడి ఉమాశంకర్ నిర్వహించగా, సాదు చలపతి క్లాప్ కొట్టి షూటింగ్ ప్రారంభించారు. తదుపరి అయినాల మల్లేశ్వరరావు, దేవరపల్లి వీరయ్య, కనపర్తి మధుకర్, శశికిరణ్, శేఖర్, సోమేష్, రాయుడు, జీవన్‌శ్రీ, నాగేశ్వరరావు, దేవిశెట్టి కృష్ణారావు, రజని, వసంతయామిని, తులసిలపై కీలకమైన సన్నివేశాన్ని చిత్రీకరించారు. దళిత సార్వత్రిక విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ ఆచార్య గుజ్జర్లమూడి కృపాచారి మాట్లాడుతూ విద్యావ్యవస్థ నేపథ్యంలో తెరకెక్కుతున్న ఈ చిత్రం బాగా రావాలన్న ఆకాంక్షను వ్యక్తంచేశారు. బాలల సినిమా తీసేందుకు ముందుకొచ్చిన చిత్ర నిర్మాతలు అమిరినేని వెంకటప్రసాద్, సాదు సుస్మిత, కన్నెగంటి రవిని అభినందించారు. పట్టణ కళాకారుల సంఘం ప్రధాన కార్యదర్శి గరికపాటి సుబ్బారావు, స్థానిక కళాకారులు, దర్శకులు బడుగు మోహనరావు, మేరుగ సంజీవరావు, ముట్టడి ప్రకాష్, నవీన్ తదితరులు చిత్రబృందాన్ని అభినందించారు. తొలుత నాట్యాచారిణి ఎ.వెంకటలక్ష్మి శిష్యబృందం నృత్యాలను ప్రదర్శించింది. సినిమాకు డీఓపీలుగా రమేష్, భాస్కర్, ఆర్ట్ డైరెక్టర్లుగా ఎం.వెంకట్, కె.శ్రీను, మేకప్, కాస్ట్యూమ్ డిజైనర్ వెనిగళ్ల వెంకటేశ్వరరావు (సురభి), స్టిల్స్ డి.మధు. కథ, స్క్రీన్‌ప్లే, మాటలు, దర్శకత్వం: కనపర్తి రత్నాకర్. కార్యక్రమాన్ని ఎం.శ్రీకాంత్, ఎం.సుబ్బారావు, సంజయ్ పర్యవేక్షించారు.

నేడు వైఎస్సార్ సీపీ కార్యాలయం ప్రారంభం

తాడేపల్లిరూరల్: మంగళగిరి నియోజవర్గంలోని దుగ్గిరాల గ్రామంలో వైఎస్సార్ సీపీ మండల కార్యాలయాన్ని ప్రారంభిస్తున్నట్లు పార్టీ దుగ్గిరాల మండల అధ్యక్షులు శృంగారపాటి రత్నం బుధవారం తెలియజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా నాయకులు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఈదుల మూడి డేవిడ్‌రాజు మాట్లాడుతూ దుగ్గిరాల జెండా చెట్టు వద్ద వైఎస్సార్ సీపీ కార్యాలయాన్ని ఏర్పాటు చేశామని, గురువారం సాయంత్రం 6గంటలకు రాజ్యసభ సభ్యులు విజయసాయిరెడ్డి, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త గంజి చిరంజీవి చేతులమీదుగా కార్యాలయం ప్రారంభమవుతుందన్నారు.

రేషన్ ఆపరేటర్‌పై దాడి.. అట్రాసిటీ కేసు నమోదు

తాడికొండ: రేషన్ బియ్యం సరఫరా చేస్తున్న ఆపరేటర్‌పై దాడి చేసిన కేసులో తుళ్లూరు మండలం దొండపాడు గ్రామానికి చెందిన కొమ్మినేని శ్రీనివాసరావుపై ఎస్సీ, ఎస్టీ, అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు తుళ్లూరు సీఐ సుభానీ తెలిపారు. వివరాల ప్రకారం రేషన్ సరఫరా ఆపరేటర్ మిట్టనోసుల కోటేశ్వరరావు బియ్యం పంపిణీకి దొండపాడు గ్రామానికి వెళ్లగా అదే గ్రామానికి చెందిన కొమ్మినేని కోటేశ్వరరావు వివాదానికి దిగి కులం పేరుతో దూషించాడు. ఇంటికి సమీపంలో పంపిణీ పాయింట్ వద్ద బియ్యం పంపిణీ చేస్తుండగా గొడవ పెట్టుకొని తన ఇంటి వద్దకు వచ్చి ఇవ్వాలంటూ కులం పేరుతో దూషించాడని ఇచ్చిన ఫిర్యాదులో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సుభానీ తెలిపారు.

పీహెచ్‌సీల్లో కాన్పుల సంఖ్య పెంచాలి

ఫిరంగిపురం: పీహెచ్‌సీలలో కాన్పులసంఖ్య పెంచేందుకు వైద్యులు కృషి చేయాలని జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి విజయలక్ష్మి అన్నారు. మండలకేంద్రంలోని ఫిరంగిపురం హెల్త్ వెల్‌నెస్ సెంటర్, నుదురుపాడు ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని బుధవారం ఆమె పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ కనీసం నెలకు పదికాన్పులు అయినా జరిగేలా చూడాలని వైద్యులకు సూచించారు.